* భగవంతుడు ప్రతిచోటా వుండలేడు అందుకే తల్లుల్ని సృష్టించాడు!

# అమ్మ



**శాంతీ...**

"అమ్మ వెళ్లిపోయింది"

ఆ మాటలే పదేపదే నన్ను కుదిపేస్తున్నాయి. నిన్ననే ఆ సినిమా చూస్తూ ఎంత తీవ్రమైన ఉద్వేగానికి లోనయ్యానో ఇంతలోనే ఈ వార్త...!

వంద సంవత్సరాల క్రితం జరిగిన యదార్థ గాథ. జీవితం ఎంత బీభత్సరసప్రధానమో శక్తివంతంగా చెప్పిన కళాత్మక శిల్పం. ఆ చిత్రంలో దరిద్రం కాదు నన్ను గగుర్పాటుకు లోనుచేసింది.

*అమ్మ!*

అవును. కేవలం అమ్మ. ప్రపంచానికి అస్తిత్వమిచ్చిన అమ్మ. తన స్తన్యాన్ని బిడ్డకు నింపి జీవితంలోకి పంపే అమ్మ.

ఆరు నెలలపాటు మంచులో కూరుకుపోయే ఆ ప్రాంతంలో తర్వాత పండించే కొద్దిపాటి పంటతో మొత్తం సంవత్సరం గడపాలి. దరిద్రాన్ని భరించలేక భ్రూణహత్యలకూ, నైతికంగా దిగజారుడుకు ఆలవాలమయిన ఆ ప్రాంతంలో ఓ వయసుదాటిన వారిని మృత్యువుకు ఎరవేసే భయంకర ఆచారం.

వయసు తెస్తున్న ఆరాటాల్ని అణుచుకోలేక, ఒకే ఇంట్లో ఉంటున్న అన్నావదినల్ని చూసి అల్లాడిపోతున్న తనబిడ్డ, మరోవ్యక్తి తన కుటుంబంలోకొస్తే, తిండి నరిపోని దరిద్రంలో ఆ తల్లి ఓ నిర్ణయానికొస్తుంది. బలవంతంగా తనవొళ్లు రాతికేసికొట్టుకొని మంచురానున్న దినాల్లో మృత్యువును ఆహ్వానిస్తుంది.

తన బిడ్డల కోసం కొన్ని దశాబ్దాల జీవితాన్ని త్యాగంచేసిన ఆ తల్లి, బయలుదేర్తూ విత్తనాలు నాటుతుంది. అవి రేపు మొక్కలై, వృక్షాలై, ఫలాలకొస్తే తనబిడ్డల బిడ్డలు అనుభవిస్తారు. ఎంతటి అమృత హృదయం 'అమ్మది'. తనకంటూ ఏమీ మిగుల్చుకోదు. ఆఖరికి చలి నుండి కాపాడటానికి అవసరమైన దుస్తుల్ని సైతం పిల్లలకే విడిచివెళ్తుంది.

కొరివి పెట్టాల్సిన పెద్దకొడుకు స్వయంగా కన్న తండ్రిని ఆ చోటులో పారేసివచ్చాడు. ఇప్పుడు తల్లిని...! ప్రయాణం ఆరంభమయింది.

"నేను నా తండ్రిని చంపాను. తల్లిని చంపుకోబోతున్నాను" అనుకుంటాడు.

తన తల్లిని పారేసేచోటు రానేవచ్చింది.

అత్యంత భయంకర దృశ్యం.

ఎటుచూసినా ఎముకలు... పుర్రెలు...


ఆహారం కోసం ఎదురుచూస్తున్న రాబందులు...

పీకుతున్న కళేబరాల మూలల్లో మాంసం దొరుకుతుందేమోనని వెతుక్కుంటున్న రాబందులు... అంతులేని దుర్వాసన... ఆ ఎముకల గూళ్ళమీద నడుస్తూ, భరించలేక తల్లిని వెనక్కు తీసుకువెళ్ళాలనే ప్రయత్నం... ఆ తల్లి అంగీకరించదు. ముందుకు నడిపిస్తుంది. ఆ ఎముకల నడుమ కొద్దిపాటి ప్రదేశం కనిపిస్తుంది.

అక్కడ ఆగమంటుంది. తన వీపు మీద నిచ్చెనకు కట్టబడ్డ అమ్మను ఆ ప్రాంతంలో కూర్చోబెడతాడు దశాబ్దాల తమ అనుబంధం గుర్తొచ్చి ఆ తల్లి హృదయం మీద వాలిపోయి వెక్కివెక్కి ఏడుస్తాడు. ఆమె బిడ్డను మెల్లగా తన నుండి వేరుచేస్తుంది. తనతోపాటు

తెచ్చుకున్న ఆహారవు నంచిని ఆమె కందిస్తాడు. ఆమె నిరాకరిస్తుంది. కానీ అతడు బలవంతంగా ఆమె ముందుకు నెడతాడు. ఆమె ఆ క్షణంలో తనబిడ్డ చెంప మీద బలంగా కొడుతుంది.

నిర్ఘాంతపోయిన తనబిడ్డను స్పృశిస్తూ ఆ మూటను నిచ్చెనకు తగిలిస్తుంది. "అమ్మా" అంటూ భోరున విలపిస్తున్న తన బిడ్డను వెళ్ళిపొమ్మని సైగచేస్తుంది మౌనంగా.



– సంధ్యా లక్ష్మణ్

మృత్యువును ఆహ్వానించిన తనకు... ఆ కనీస ఆహారం కూడా తన బిడ్డలకే వదిలేసిన ఆ మహోన్నత మానవతామూర్తిని చూస్తున్న నేను... ఆ దృశ్యంలో అణు వణువూ తీవ్రప్రతిస్పందనకులోనై, ఆపుకోవాలనుకున్న దుఃఖం వెల్లువలామారి విరుచుకువడ్డప్పుడు... నన్ను చూసి... కంగారువడ్డ నా స్నేహితురాలు భుజంమీద చెయ్యివేసి అనునయించింది.

ఎట్టకేలకు గుండెను బిగబట్టుకొని వెనక్కు తిరుగుతా డు కొడుకు. మంచు కురవటం ఆరంభమైంది... ఎందు కో తల్లిని చూడాలనిపించి వెనక్కి తిరుగుతాడు. రెండు చేతులూ జోడించి, మంచులో కప్పబడిపోతున్న తల్లిని పిలుస్తాడు. ఆమె మాట్లాడదు. మౌనంగా వెళ్లిపొమ్మని సైగ చేస్తుంది.

మంచు కురుస్తూనే ఉంటుంది. ఆ కొండల మీద నుండి జారుకుంటూ వస్తాడు. మంచుకురుస్తూనే ఉంటుంది. చెట్లమీద, ఇళ్లమీద... అలా మరో ఆరు నెలలపాటు...

సినిమాహాలు నుండి బైటికిరాగానే "ఎందుకంతగా బరస్టయ్యావు?" అనడిగింది నా స్నేహితురాలు.

ఏం చెప్పను? ఎల్లలులేని ఆ మహోన్నత మానవ త్వానికి హృదయం కదిలి అని చెప్పనా! నవమాసాలు మోసి, తన రక్తాన్ని పాలుగామార్చి, తను వస్తులున్నా తనబిడ్డల కోసం ఓ అమ్మ యొక్క అత్యంత త్యాగం తల్చుకొని ఉద్వేగం తట్టుకోలేక ఏడ్చానని చెప్పనా?!

ఎలా చెప్పగలం... అందుకు ఏ భాష... ఏ పదజాలం... ఏ వ్యక్తీకరణ సరిపోగలదు. అనంతమైన ఈ మానవ పరిణామక్రమంలో కేవలం 'అమ్మ'కు మా త్రమే ఇంతటి మహోన్నతమైన 'పరిణీతి' ఎలా సాధ్య మైంది.

ఏ వివరణ, ఏ సిద్ధాంతం ఈ అపురూప అనుబంధా న్ని విశ్లేషించగలదు?

నిన్నటి నుండి ఈ సినిమా గురించే ఆలోచిస్తున్నా... ఏ నాటికయినా ఈ దరిద్రానికి అతీతమైన ప్రపంచం ఏర్పడాలనే ఆరాటంతో బయటికొచ్చాను. "ది బల్లాడ్ ఆఫ్ నరయమ" అనే సినిమా ఇది. వందసంవత్సరాల క్రితం, దరిద్రాన్ని జయించడానికి అవకాశాలు అత్యంత తక్కువగా ఉన్నకాలంలో ఓ మారుమూల గ్రామంలోని చరిత్రకు తెరరూపం.

వంద సంవత్సరాలు ముందుకొచ్చాం. ఆధునికత అన్నిరంగాల్నీ ఒక్కసారిగా ప్రళయంలా ముంచెత్తింది. అయినా కూడా ఇప్పటికీ దరిద్రానికి చెందిన అనంత మైన వార్తలు... ఆత్మహత్యల పర్వాలు... తమ బిడ్డల్ని చంపి తమ ప్రాణాలు తీసుకుంటున్న తల్లులు. ఎంత భయానకం! ఎంత బీభత్సం.

నా ముందు ఉత్తరాలు పడున్నాయి.

నా చేతిలో ఆ లేఖ రెపరెపలాడుతోంది. తిరిగి ఆ లేఖ చదవటాని కువక్రమించాను.

**శాంతీ...**

**అమ్మ వెళ్ళిపోయింది.**

అవును. మొత్తం లేఖ సారాంశం అదే. ఇలాంటి దురదృష్టకర సంఘటనను ఏనాడైనా ఊహించామా?!

మరెందుకిలా జరిగింది?

* * *

'అమ్మ'... అవును ఆమెను 'అమ్మ'నే అంటాను. నన్ను కనకపోయినా తల్లిలా ఆదరించింది. భావించింది. అలాంటి మానవతామూర్తికి ఎంతటి దారుణమైన వ్యాధి రావటం జరిగింది!

ఆ రోజు రవికాంత్ ఎంతగా గుండెలు పగిలేలా ఏడ్చాడని...

"అవును శాంతీ... ఆమె నాకు కేవలం తల్లి మాత్రమే కాదు. ఈ ప్రపంచం. నా సర్వం. ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం నాన్న మరణిస్తే నన్ను హృదయానిక త్తుకొని... గుండెల్లో వేదన దిగమ్రింగి... నా కంటూ ఓ వ్యక్తిత్వం ఏర్పరుచుకోవటానికి రాత్రింబవళ్ళూ తపించిన ఆ అమృతమూర్తి ఏ పాపం చేసిందని ఈ వ్యాధి రావాలి. ఎవరికి అన్యాయం చేసిందని, ఎవరిగు రించి తప్పుగా, దుర్మార్గంగా ఆలోచించిందని ఆమెకీ దుస్థితి" అంటూ కుమిలిపోతున్నప్పుడు నేనేం చేయగ లిగాను!

"ఊరుకో రవీ... ఇది నిజంగా దారుణమే. మంచివా ళ్ళకే అన్నీ ఎదురౌతుంటాయి. వాళ్ళు భరించటాన్ని జీవిత విధానంగా మార్చుకున్నారు. ఆ తల్లిని గుండెల్లో పెట్టుకుసాకటమే నీ కర్తవ్యం" అని నేనన్నప్పుడు,

"అవును. అమ్మ కోసం నేను నా జీవితాన్ని త్యాగం చేస్తాను" అన్నాడు రవి.

నిజమే. రవి అందుకు పూనుకున్నాడు.

ప్రపంచం ఏ వ్యాధినయితే తీవ్రంగా పరిగణిస్తుందో, భయపడి పారిపోతుందో.... ఏ వ్యాధి అయితే నయంకా దనే భావాలకు లోనయిందో అలాంటి కుష్టువ్యాధి.

తనబిడ్డ కోసం శ్రమించటం తప్ప బయటప్ర పంచంలోకి రావాలనే తపనలేని గదిలో ఓ మూల కూర్చుని, తల వంచుకొని తనలోతాను కుమిలిపోయేది.

"అమ్మా శాంతొచ్చింది" రవిచెబితే,

ఒక్కసారిగా ఆశగా తలెత్తితే ఆ కళ్ళు మెరిసి... మరుక్షణం వాలిపోయి తనలోతాను కుంచించుకు పోయి... అగాథంలో ఉండి మాట్లాడుతున్నట్లు...

'ఎందుకమ్మా అంత బాధపడ్తావ్' అన్నప్పుడు ఆ తల్లి కళ్ళలో నీరు చిప్పిల్లి... ఓహ్! ఎంతదుర్భరం!

రవి అమ్మను ఎంత ప్రేమగా చూసుకున్నాడని! ఆ విషయాలన్నీ నాకు తెలును.

"లేదు శాంతీ... అమ్మ ఎంత చెప్పినానరే నేను పెళ్ళి చేసుకోను. ఆమె నన్ను మోసింది. కని పెంచింది. అందువల్ల ఆమెకోసం నేను ఏమైనా చేయగలను. చేయాలి. కానీ కొత్తగావచ్చే అమ్మాయికి అలాంటి స్పంద నలుండాలనేముంది. ఆమె అమ్మను ఏమాత్రం తక్కు వగా చూసినా నేను భరించలేను" అని ఎంతగా వారించాడు.

వారిద్దరికీ వారధిలా నేనే నిలబడింది.

"లేదు రవి. అమ్మ గురించి నువ్వూ ఆలోచించు. చిన్నవయసులో తన భర్తపోతే ఎవరికోసం ఆమె బ్రతి కింది? నిన్నే గొప్ప వ్యక్తిగా తీర్చాలని, నీకంటూ ఈ సమాజంలో ఓ స్థానం ఏర్పడాలని ఆమె ఎంతగా కలగంది! నీ భవిష్యత్‌కు మించి ఆమెకు మరో ఆలోచ నంటూ ఉందా? అలాంటి తల్లి తనకు వ్యాధి ఉందనే కారణంగా తనబిడ్డ మోడులా మిగిలిపోవటాన్ని భరిస్తుం దనుకుంటున్నావా? ఏమాత్రం భరించదు. అందుకనే

ఆమె నీ పెళ్ళి చూడాలని ఆరాటపడుతూంది. నువ్వు కూడా ఆలోచించు. నువ్వు చెబుతున్న విషయంలోనూ పాయింట్ ఉంది. కానీ నీ సుఖాన్ని మించి ఆలోచించని ఆ తల్లి మాత్రం మనం ఏం చెప్పినా అంగీకరించే స్థితిలోలేదు. ఆమె దేన్నయినా భరిస్తుందిగానీ తన కారణంగా బిడ్డ బ్రహ్మచర్యాన్ని అంగీకరించదు."

"నిజమే శాంతీ. అమ్మ ఇన్ని సంవత్సరాలు నా కోసం ఆలోచించింది. మరి ఆ బాధ్యత, ఆ అనుభూతి నాకుండదా? అమ్మ చిన్నతనంలో భర్తపోతే ఏంచేసింది? తిరిగి మరలా ఎందుకు వివాహం చేసుకోలేదు? నా కోసం తన జీవితాన్ని ఎందుకు పణంగా పెట్టింది? ఇంత త్యాగం చేసిన ఆమె బిడ్డగా నేను చెయ్యలేనా? అమ్మ గుండెల్లో తలదాచుకొని "తగ్గిపోతుందమ్మా ఈ కుష్ఠుమహమ్మారి నిన్నే కాదు ఈ ప్రపంచాన్నే విడిచివెళ్లే రోజొస్తుంది అని చెప్పాలనుకునే క్షణంలో అమ్మ ఎందుకీ వాదనలు తెస్తుంది?"

ఏం మాట్లాడాలి?!

అనంతమైన త్యాగాలకి ఇరువురూ సిద్ధమైనప్పుడు... ఎవరికి చెప్పాలి? ఎవర్ని సమాధాన పరచాలి!

"నా బతుకే కష్టాలకంకితమైంది. ఇప్పుడు ఈ రోగమూ వచ్చింది. ఇంత కష్టపడింది వాడ్ని అలా గాలికొదలటానికా తల్లీ" అని అమ్మ అంటుంది.

అందుకే నేను చెప్పాను.

"రవీ ఆలోచించు. కేవలం పెళ్ళి చేసుకున్నంతమాత్రాన అమ్మకు దూరమవుతామనుకోవడం పూర్తిసత్యం కాదేమో! నీ భార్య సైతం స్త్రీనే. ఆమె కూడా అర్థంచేసుకుంటుందేమో! ఒకవేళ ఆమె ఆ స్థితిలోలేకున్నా నువ్వు నచ్చచెప్పగలగాలి. మానవత్వంతో ఆమెను ఆదరించేలా చేయాలి. అంతేకాదు. అమ్మ త్వరగా కోలుకోవాలన్నా నువ్వొక్కడివే చేసే సేవలు చాలవు. మరో విషయం, భార్యలంతా ఒకలాగే ప్రవర్తిస్తారనే ఆలోచన కూడా నాకంతగా నచ్చడంలేదు" అన్నాను.

నాకేసి అయోమయంగా చూశాడు రవి.

"అయితే అమ్మ విషయంలో నేను టాస్ వేయాలి. ఖచ్చితంగా అంతే శాంతి... ఆమె అదృష్టం బాగుంటే ఆమెను ఆదరించే వ్యక్తి వస్తుంది లేదా..."

రవికి పెళ్ళయింది.

ఆ అమ్మాయితో రవిని చూస్తుంటే అమ్మ కళ్ళలో ఎంత ఆనందం! రవి తన తల్లిని చూస్తూ తనలోని ప్రకంపనల్ని కంట్రోల్ చేసుకోవడానికి ఎంతగా తపనపడ్డాడో నాకు బాగా గుర్తు.

సంవత్సరాలు గడుస్తున్నాయి.

నాకంటూ ఓ జీవితం ఏర్పడింది. నాకూ పెళ్ళి... పిల్లలు... తీరిక దొరకని పనులు. అప్పుడప్పుడు వెళ్ళి చూసొస్తున్నా మా నడుమన ఉత్తరాలే ప్రధానం.

"శాంతీ! ఏం రాయమంటావ్... ఇన్ని సంవత్సరాల కాలంలో ఈ వ్యాధి వ్రేళ్ళను తినేసింది. అయితే ఈ వ్యాధి ఇతర భాగాలకు వ్యాపించదంటున్నారు డాక్టర్లు. ఎంత ఖర్చయిందన్నది కాదు ప్రధానం... ఈ వ్యాధి అమ్మ హృదయాన్నీ మనసునూ తినేస్తోంది శాంతీ"

ఆరునెలల క్రితం కాబోలు రవి నుండి దీర్ఘమైన లేఖ వచ్చింది.

"శాంతీ... నీకారోజు చెప్పాను. చాలా కాలం తర్వాత నేను మాట్లాడుతున్నా. ఉషను ఎంతోమార్చాలని నేను ప్రయత్నంచేశాను. కానీ విఫలం అయ్యాను. నీకు తెలును. కాలం ఆగదని. ఈ నడుమకాలంలో మార్పు ఏమిటా అని ఆలోచిస్తే నాకిద్దరు పిల్లలు పుట్టడం. ఇది కూడా మా జీవితంలో శాపమేమో అనిపిస్తుంది.

"పిల్లలు లేనంతవరకూ ఏ భావంతోనైనా అమ్మను ఉష భరించింది. పిల్లలు పుట్టాక ఉషలో మార్పు వచ్చింది. తన పిల్లలకూ ఆ రోగం అంటుకుంటుందేమోనని విలవిలలాడిపోతూంది. రానురానూ అదెంత తీవ్రమైన స్థాయిలోకొచ్చిందంటే మేం విడిగా ఉండాలన్నంతవరకూ...

"ఈ పరిస్థితుల్లో నేను ఎవర్ని వదులుకోవాలి? నేను ఏ రకమైన సన్నివేశాన్ని ఊహించానో అలాంటిది ఏర్పడింది. ఇప్పుడు నేను చేయగలిగిందొక్కటే. ఉషను సంతృప్తిపరచటం. అందుకే మేం వేరుగా వెళ్తున్నాం. నాకు 'ట్రాన్స్‌ఫర్' అయింది. అమ్మ మాత్రం ఆ గదిలోనే ఉంటుంది. మేం వెళ్తున్న ఊరు ఎంతో 'దూరం' కాదు."

"శాంతీ నేను రెండు రోజులకోసారి వస్తున్నా.... అమ్మ వారించినా నేను ఆ గాయాలు శుభ్రంచేసి ఆమె చెంతనే కూర్చుంటున్నా. వారానికోసారి అమ్మకు చూపించటానికి పిల్లల్ని తీసుకొస్తున్నా. వాళ్ళు భయం భయంగా దూరంగా నిలబడతారు. నేను దగ్గరకు రమ్మంటాను. కాని అమ్మే వొద్దని వారిస్తుంది. ఆమె కళ్ళలో సుడులుతిరిగే నీటిని చూశాక ఈ జీవితం ఎందుకనే నిరాశా... ఎవరిమీదో కసి ఏర్పడుతున్నాయి.

"ఇప్పుడు నాకేమనిపిస్తుందో తెలుసా? నన్ను ఇంతవాడిని చేయటానికి కారణమైన తల్లివల్ల నేను సరిగా వ్యవహరించటం లేదేమోననిపిస్తోంది. నేను కూడా భార్యా, పిల్లలు అనే స్వార్థంలో పడిపోయానా అనిపిస్తోంది. ప్రపంచానికి సంబంధం లేకుండా జైలుగోడలాంటి గదిలో ఆమెను ఉంచటంవల్ల నేనెంత క్షోభిస్తున్నానో నువ్వు అర్థంచేసుకోగలవు. కానీ అంతకంటే ఏం చేయలేకపోతున్నాను.

"నిజం. ఆ కుష్ఠు రోగం అమ్మకు కాకుండా నాకే వస్తే బాగుండేదనిపిస్తుంది. ఇంతవరకూ నేను ఆర్థికంగా పడుతున్న ఇబ్బందుల గురించి రాయటంలేదు. అవన్నీ ఎలాగోభరిస్తాను. అయినా ఒక ముక్క చెప్పాలనుకుంటున్నాను. ఇలాంటి భయంకర రోగాలు మాత్రం మనలాంటివారికి రాకూడదు. నేను గిల్టీగా ఫీలవుతున్నాను. నేను పడుతున్న ఆవేదనలో నాకంటూ మిగిలిన నేస్తానివి నువ్వు... నాలోని సంఘర్షణను నీ ముందుంచుతున్నాను.

"నీ నుండి వచ్చే లేఖ నన్ను ఈ బాధలనుండి తాత్కాలికంగానైనా ఉపశమింపచేస్తుంది. అందుకే నీ లేఖ కోసం ఎదురుచూస్తున్నాను"

సమస్య రానురానూ తీవ్రతరమౌతూంది. నేనీ సమస్యలో 'ఉష'ను అర్థంచేసుకునే ప్రయత్నం చేశాను. ఆమె తన ప్రవర్తన గురించి ఏ రకమైన వివరణ ఇస్తుందా అనేది కూడా నా దృష్టిలో ఉంది. అయినా నేను తిరిగి రవికి లేఖ రాయటానికి ఎంతగానో ఆలోచించాల్సివచ్చింది.

జీవితానికి చెంది సులభశైలి పరిష్కారాలు తయారుగా లభించగలవని నేను భావించటంలేదు. అందులోనూ విభిన్నవ్యక్తుల మానసికపరిస్థితుల్ని అంచనా కట్టుకోవాల్సివచ్చినప్పుడు ఏమాత్రం త్వరపడ్డా... నా ఉద్దేశం ఓ అభిప్రాయం వెలువరించటం కూడా సాహసం అవుతుంది. అలాగని మౌనంగాఉన్నా ఎస్కేపిజం అవుతుంది.అందుకే నేను 'రవి'కి లేఖరాసినా కొన్ని విషయాలవట్ల స్పష్టంగా లేను.

"రవీ మిగతా విషయాలలాఉంచు. నీ మానసిక పరిస్థితినీ, అమ్మ పరిస్థితినే నేను ఊహించగలుగుతున్నాను. ఇప్పుడు నువ్వు విడిగా ఉండటమనే విషయంలోని మంచి, చెడ్డల గురించి నేను ఆలోచించటంలేదు. నువ్వు అమ్మకు ద్రోహం చేస్తున్నాననే భావంలోపడకు. ఈ రోజు నువ్వు కేవలం అమ్మకు బిడ్డవు మాత్రమేకాదు. ఆ విషయం నీ దృష్టిలో ఉండాలి. నీ లేఖ ప్రకారం అమ్మను విడిగా ఉంచటంవల్ల నువ్వెంతగా నలిగిపోతున్నావో నేను అర్థంచేసుకున్నాను. కానీ నువ్వా భావం నుండి బయటపడకపోతే నువ్వు దూరంగా ఉంటున్న విషయంకంటే నీ మానసిక పరిస్థితే అమ్మను ఎక్కువ బాధపెడ్తుంది."

నా లేఖలోని సారాంశం అది. ఇప్పుడు నేను మరోసారి రవి ఉత్తరం చదివాను.

**శాంతీ...**

**అమ్మ వెళ్ళిపోయింది.**

"ఆత్మహత్య చేసుకొనిఉంటుందని నా నమ్మకం. ఈ కుష్ఠురోగం వేళ్ళను మాత్రమే తిని ఊరుకోలేదు. మా హృదయాల్నీ మనసునూ తినేసింది. ఇప్పుడు ఏడవటానికి నా కంట్లో నీరులేదు. శాంతీ! అమ్మను పోగొట్టుకున్న ఓ అనాధను... ఇప్పుడు ఆదరణకోసం తపించిపోతున్నా... ఆరు నెలలుగా నేను పడుతున్న వేదనతో విసిగి, వేసారి నేనే ఏ దూరప్రాంతాలకో పారిపోదామనుకున్నా. మీ దగ్గరకొచ్చి కొన్ని రోజులపాటు ఈ మానసిక హింస నుండి బయటపడాలనుకున్నా...

కానీ... కానీ గత ఎనిమిది సంవత్సరాలుగా తనను తాను బాధించుకుంటున్న అమ్మ... నాతో సైతం హృదయంవిప్పి మాట్లాడలేకపోతున్న అమ్మ... నన్ను... నన్ను... తల్లిలేనివాడ్ని చేసి వెళ్లిపోయింది శాంతీ .

వెళ్తూ ఈ బిడ్డకు ఏం రాయలేదు. ఈ గదిలో అమ్మ హృదయం విడిచి వెళ్ళిందేమోనని వెతుక్కుంటున్నా శాంతీ... అంగుళమంగుళం పరిశోధిస్తున్నా నాకిప్పుడు చిన్ననాటి అనుభూతులు కూడా గుర్తురావటం లేదు. ఒంటరిగా కూర్చుని... తనేదో నేరం చేసినట్లు కుంచించుకుపోయే అమ్మ... తనచేతుల్ని చీరచెంగుల్లో దాచుకోవాలనుకునే అమ్మ... తన గాయం తుడుస్తున్నప్పుడు వారించాలని చూసే అమ్మ... ఈ దృశ్యాలే శాంతీ... నన్ను కదిలిస్తూంది...!

ఇప్పుడు నాకనిపిస్తూంది. అమ్మ నా మాటలు వినలేదు. వింటే ఈ రోజు ఇలాంటి స్థితి వచ్చేదా?

నాకయితే ఏమేమో రాయాలనిపిస్తుంది. ఇప్పుడు నా బాధేమిటో తెలుసా? అమ్మ ఎక్కడయినాసరే జీవించి ఉందా? అమ్మ కోసం నా ప్రయత్నాలు నేను చేస్తున్నా. ఇప్పుడు నాకు ఓదార్పుకావాలి శాంతీ... నాకిప్పుడు అమ్మ కావాలి. అందుకే రాస్తున్నా మీ నుండి లేఖ వస్తుందని ఎదురుచూస్తున్నా... ఈ సమయంలో ఓ ముక్క రాయాలి. నాతో కొన్ని అభిప్రాయబేధాలున్నంత మాత్రాన ఇలాంటి సమయంలో కూడా "సానుభూతి" చూపడానికి వెనుకాడుతున్న కొందరు మిత్రులు సరిగ్గా ఇప్పుడే అర్థమౌతున్నారు."

నేను ఆలోచిస్తున్నా... ఇప్పుడు నేను ఉత్తరం రాయాలి. అమ్మను కోల్పోయిన ఓ బిడ్డకు... గాయపడ్డ ఓ

మనసుకు స్వాంతన చేకూర్చాలి. ఇది సాధారణ విషయంకాదు. అంతేకాదు. అమ్మ వెళ్ళిపోవటానికి కారణం ఏమిటి? ఈ అంశం కూడా నేను బేరీజువేసుకోవాలి. అందుకే మధనపడుతున్నది.

ఇరవైనాలుగు గంటలు గడిచాయి...

నేను కలం తీసుకుంటే ఏం రాయాలో అర్థంకావటం లేదు. కానీ వెంటనే రవికి లేఖ రాయటం అత్యవసరం!

నేను కళ్ళు మూసుకున్నా... నా దృష్టిలో ఆ గదిమూల తల వంచుకునిలబడ్డ అమ్మ... నా మదిలో తనబిడ్డల కోసం వళ్ళూడగొట్టుకొని మృత్యువునాహ్వానించిన అమ్మ...

అమ్మ... అమ్మ... అమ్మ...

ఓ వెలుగు నాలో క్రమంగా ప్రసరిస్తున్నట్లనిపించింది. ఇప్పుడు నేను కలం తీసుకున్నాను.

రవీ....

నీ ఉత్తరం ఎంతటి విషాదాన్ని మోసుకొచ్చిందో తెలుసా! నీకీ ఉత్తరం రాయటానికి ఇరవైనాలుగు గంటలు శక్తి కోల్పోయాక... అతిప్రయత్నం మీద రాస్తున్నా... నిజమే. అమ్మ వెళ్ళిపోయింది. ఎందుకు? బహుశా ఏకాంతం భరించలేక ఆ గదిలో వంటరిగా మ్రగ్గలేక... ఇదోకోణం... తనబిడ్డ దూరంగా విసిరేసినందుకు, ఇది మరోకోణం...

కాని రవీ నింపాదిగా ఆలోచిస్తే అమ్మ నిర్ణయాల వెనుక మాతృత్వమే కనపడుతూంది.

ఒక్కసారి వెనక్కితిరుగుదాం. నాన్న మరణం తర్వాత నిన్ను సాకటం... తనకు భయంకరమైన జబ్బు చేశాక నిన్ను వివాహం చేసుకోమనటం. చేసుకున్నాక నీ సంఘర్షణను చూసి భరించలేకపోవటం... తను వెళ్ళిపోవటం... వీటన్నింటి వెనుక మాతృత్వాన్ని మించిందేదీ గోచరించటం లేదు.

తాను వెళ్ళిపోతే... తాను ఆత్మహత్య చేసుకుంటే తన బిడ్డకు దినదిన ఘర్షణ ఉండదు.. ఒక్కసారే బాధపడ్తాడు. ఇలాంటి ఆలోచనే ఆమెతో ఈ పని చేయించి ఉంటుంది. ఇంతటి గొప్ప తల్లికి బిడ్డవుకావటం నీ అదృష్టం... ఇంత గొప్ప హృదయంకల అమ్మను కోల్పోవటం మన దురదృష్టం.

నేనే ఇంత డిప్రెషన్‌కు లోనయితే నీ స్థితి ఎలా ఉంటుందో నాకు తెలును. కాలం మాత్రమే ఈ సమస్యను పరిష్కరించగలదని ఎదురుచూసిన నాకు ఇప్పుడే మనిపిస్తుందో తెలుసా!


ఏకాంతం మహా దుర్మార్గమైంది. మానవుడు ఈ ఏకాంతాన్ని బ్రద్దలుకొట్టాలి. అందుకే అమ్మ వెళ్ళిపోయింది. ఆమె మరణించదు. ఎక్కడో జననందుమ ఉంటుంది. మనం వెతుక్కుందాం. తనబిడ్డ తిరిగి జీవితంలోకి ప్రవేశిస్తాడనే ఊహ ఆమెను ముందుకు నడిపిస్తుంది. ఆమె దూరంనుంచైనా నిన్ను చూడటానికి వచ్చి తీరుతుంది. రవీ! నిజం. కాలమే ఈ సమస్యను పరిష్కరిస్తుంది. మేం రెండురోజుల్లో బయలుదేరివస్తున్నాం. వచ్చాక...

నా కలం ఆగిపోయింది.

ఎంత ప్రయత్నించినా కదలటంలేదు.

నేను ఉద్వేగంతో స్వగతంగా అనుకున్నాను.

"రవీ! రావయ్యా! నువ్వు తల్లిలేని అనాధవుకావు. అమ్మ వదిలివెళ్ళిన మాతృత్వపు అనుభూతిని నీకందించగలిగితే నేను ధన్యురాల్ని."




* రానున్న దీపావళికి 'కథల పోటీ'ని నిర్వహించదలచాము. ఆ పోటీకి సంబంధించిన వివరాలు ఇక్కడ ప్రచురిస్తున్నాము.
* పోటీకి వచ్చిన కథల్లో, బాగున్న ఆరు కథలు – ఈ సంచికలో చోటు చేసుకుంటాయి.

## అలా ఎన్నిక కాబడిన ప్రతి కథకు రూ. 500 లు పారితోషికం!!

* ఇది కాకుండా, మరొక రూ 1000/- లు రావడానికి కూడా అందులోని ఒక కథకు అవకాశం వుంధి! ఎలా అంటే—
* ఈ ఆరు కథలకు న్యాయనిర్ణేతలు పాఠకులు. ఈ ఆరు కథల్లోనూ తమకు 'బాగా నచ్చిన కథ ఏది?' అన్నది పాఠకులు విపులంగా రెండు పేజీలకు తక్కువ కాకుండా రాయాలి. తమ దృష్టిలో ఆ కథ ఎందుకు ఉత్తమమైనది వివరించాలి. అలా వచ్చిన ఆ వ్యాసాల ద్వారా ఎన్నికైన ఆ కథకు (ఎక్కువమంది ఏ కథను ఎన్నుకుంటారో ఆ కథకు) మరొక

## రూ. 1000 లు బహుమతి!

* అలా వచ్చిన వ్యాసాల్లో ఉత్తమంగా వున్నదనిపించిన వ్యాసానికి **రూ. 116 లు** ఆ వ్యాసరచయిత్రికి బహుమానంగా పంపుతాము. ఆ వ్యాసం 'వనిత'లో ప్రచురింపబడుతుంది.
* ఈ కథల పోటీలో పాత, కొత్త రచయిత్రులందరూ పాల్గొనవచ్చు. కథ నిడివి అరఠావు సైజులో 8 పేజీలకు తక్కువ కాకుండా 12 పేజీలకు మించకుండా వుండాలి.
* కథతోపాటు — కథ తమ సొంత కథేనని, ఇదివరకూ ఎక్కడా ఏవిధంగానూ ప్రచురణ (లేదా ప్రసారం) కాలేదనీ, ఏ పత్రికకూ పంపలేదనీ – హామీ పత్రం జత చెయ్యాలి. ఈ పత్రం లేని కథలు – పరిశీలింపబడవు.
* కథ పేజీకి ఒకవైపునే శుభ్రంగా అక్షరాలు తెలిసేలా రాయాలి. కథపైన, హామీ పత్రం మీదా రెండు చోట్లా రచయిత్రి పేరు, పూర్తి చిరునామా వుండాలి. 'కలం పేరు' పెట్టుకున్న వారైతే ఆ విషయం విడిగా వివరించాలి. కథతోపాటు, తగినన్ని స్టాంపులు అతికించిన కవరు (తమ చిరునామాతో) పంపితే, ఎన్నిక కాని పక్షంలో కథను తిప్పిపంపడానికి వీలుంటుంది.
* పోటీకి ఎన్నిక కాని కథల్లో బాగున్నవాటిని ప్రచురించే హక్కు 'వనిత'దే. ఆ కథలు తర్వాతి సంచికల్లో వస్తాయి.

కథలు — 'దీపావళి కథల పోటీ' పేరిట, వనిత, చందమామ బిల్డింగ్స్, వడపళని, మద్రాసు-600 026—చిరునామాకు సెప్టెంబర్ 15 లోగా - చేరేలా పంపవలసిందిగా, ఉత్సాహం గల రచయిత్రులందరినీ కోరుతున్నాము.

## చివరితేదీ: సెప్టెంబర్ 15, '88